మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

సీఎం రేవంత్‌రెడ్డికి పిల్లలమర్రి జ్ఞాపికను బహూకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి, డీఏవో వెంకటేశ్, డీఎఫ్‌వో సత్యనారాయణ

కేసీఆర్‌కు కనువిప్పు కావాలి

జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ్మ

వరి వేస్తే రైతుకు ఉరి..వరి సాగు దండగ రైతులు వరి వేయవద్దన్న మాజీ సీఎంకు కనువిప్పు కలగాలని,ఈ వానా కాలంలో దేశంలోనే రికార్డు స్థాయిలో తెలంగాణలో 66.76లక్షల ఎకరాలలో రైతులు వరిసాగు చేశారని,సుమారు 153లక్షల మెట్రిక్ టన్నుల వరిని ఉత్పత్తి చేశారని జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ్మ స్పష్టం చేశారు.రైతులకు 18వేల కోట్ల రుణమాఫీతో పాటు నస్నాలకు రు.500బోనస్ ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారేకే దక్కుతుందన్నారు.

ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నాం..

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై విధ్వంసమైందని,రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని బయటకు లాగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.రైతులు సాంప్రదాయ పంటలు కాకుండా ఆయిల్ ఫాం పంటల వైపు దృష్టిని మరల్చాలని,ఆయిల్ ఫాం పంటతో ఎకరాకు రైతు రు,2లక్షల ఆదాయం వస్తుందన్నారు.రాబోయే నాలుగేండ్లలో ప్రతి జిల్లాకొక ఆయిల్ ఫాం ఫ్యాక్టరీనేర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నట్లు మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు

- మంత్రి సీతక్క

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనతి కాలంలోనే వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చిందని రాష్ట్ర మంత్రి సీతక్క స్పష్టం చేశారు.రైతులకు ఏకకాలంలో రు.18వేల కోట్ల రుణమాఫీ జరగడం దేశచరిత్రలోనే ప్రథమని పేర్కొన్నారు. పాలమూరు మట్టిలో పుట్టిన ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి అని తన సొంత జిల్లా అభివృద్ధి కోసం పాటుపడుతున్నాడని అన్నారు.వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇచ్చిన నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్సార్ చలువేనని,నేడు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నదీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి స్పష్టం చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టులు

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నేటి పాలమూరు ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ హయాంలోనే మంజూరైనవేనని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని రు.8లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టి ఆ భారాన్ని తమ ప్రభుత్వంపై పడేశారని విమర్శించారు. లేనిపోని గొప్పలకు పోయి వారు చేసిన అప్పులకు నేడు తమ ప్రభుత్వం నెలనెలా రు.60వేల కోట్ల వడ్డీ కడుతోందన్నారు. ఎన్ని అప్పులున్నా తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు,రాష్ట్ర ప్రజలు,రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వమే శ్రీరామరక్షగా ఉంటుందన్నారు.

వివరాలు 4

బంజరు భూములు.. బంగారం చేస్తాం

20లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే బాధ్యత నాది..

- పాలమూరుపై ఎవరి దాక్షిణ్యాలు అవసరం లేదు
- ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతాం
- ఏడాదికి రూ.20వేల కోట్లు తెస్తా..
- క్యాబినెట్‌ను నేనే ఒప్పిస్తా..
- అమిస్తాపూర్ రైతుపండుగలో సీఎం రేవంత్‌రెడ్డి
- పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, ఎమ్మెల్యేలు
- లక్షలాదిగా తరలివచ్చిన రైతులు

నవంబర్ 30, 2023కు దేశ రాజకీయాల్లోనే ఒక గొప్ప ప్రాధాన్యత ఉంది..పోలింగ్ బూత్ లలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అండగా నిలబడి ఇవాళ్టికి సరిగ్గా ఏడాది పూర్తయింది. రైతు బిడ్డగా కొండారెడ్డి నుంచి బయలుదేరి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఇక్కడికి వచ్చా.. నాకు ముఖ్యమంత్రి పదవి ఆశామాషీగా వచ్చింది కాదు.. ఇది ఒక బాధ్యత...బీఆరెస్, బీజేపీ నాయకులు ఎలాంటి విమర్శలు చేస్తున్నారో మీరు గమనించండి..పదేళ్లలో వాళ్ళు ఏం చేశారో నాకంటే మీకే ఎక్కువ తెలుసు.. వాళ్ల పదేళ్ల పాలనలో రైతు రుణమాఫీ జరిగిందా?.. రైతుకు గిట్టుబాటు ధర లభించిందా?..”

– సీఎం రేవంత్‌రెడ్డి

రైతు పండుగకు హాజరైన అశేష రైతులు, ప్రజలు

రైతు పండగ సంబరాలకు తరలిన రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు

- జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలు మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని భూత్పూర్ మండలంలోని అమిస్తాపూర్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన రైతు పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి,రాష్ట్రమంత్రులు,ఎమ్మెల్యేలు హాజరవుతున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి 10వేల మంది రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు రైతు పండుగ సభకు వివిధ మండలంలోని గ్రామాలకు చెందిన రైతులు, మహిళలలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లడం ఎంతో సంతోషదాయకమన్నారు. పండగ సంబరాలకు వెళ్ళే వాహనాలకు మాజీ జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఇబ్రాహీం, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, యెన్నం భూపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్ రెడ్డి, షాన్‌వాజ్‌ఖాన్, సంజీవ్‌కుమార్‌యాదవ్, జంగయ్యయాదవ్, పట్టణ, మండలం వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

రైతు పండుగకు పెద్దఎత్తున తరలిన నడిగడ్డ రైతులు

గద్వాల, నవంబరు 30 ప్రభాతవార్త : రైతు పండగ, రైతు అవగాహన కార్యక్రమాలకు జిల్లా నుండి పెద్దఎత్తున రైతులు వెళ్లడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. శనివారం ఐ.డి.ఓ.సి ఆవరణలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం నిర్వహిస్తున్న రైతు పండుగకు జోగులాంబ గద్వాల జిల్లా నుండి 100 ప్రత్యేక బస్సుల్లో 5000 మంది రైతులు అందరినీ మహబూబ్‌నగర్ కి తీసుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణ సమయంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భోజనం, త్రాగునీటి వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతీ బస్సుకు ఒక లైజన్ అధికారి, నోడల్ అధికారురి, ఒక కానిస్టేబుల్‌ను నియమించడం జరిగిందని తెలిపారు. అన్ని బస్సులు కార్యక్రమానికి సకాలంలో చేరుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మినారాయణ, నర్సింగరావు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, ఏపీఎంలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్

రైతు వేదికలో లైవ్..

నాగర్ కర్నూల్ జిల్లా తూడుకుర్తి గ్రామ రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించిన కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా గత మూడు రోజులుగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు పండుగ వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా నుండి రైతులను ఉద్దేశించిన ప్రసంగించిన సదరు కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం ద్వారా నాగర్ కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామ రైతు వేదికలో గ్రామానికి చెందిన పలువురు రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వీక్షించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రులు అధికారుల ప్రసంగాన్ని రైతు వేదికలో రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనేక సదుపాయాలను కల్పించడంతోపాటు రైతు రుణమాఫీ, పంట నష్టపరిహారాలు, సన్న రకం వడ్లకు ప్రతి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందజేయడంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో జిల్లాలోని రైతంగానికి ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది రైతులు అధిక సంఖ్యలో నేరుగా రైతు పండుగ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుండి 250 బస్సుల్లో బయలుదేరి వెళ్లి మహబూబ్ నగర్ జిల్లాలో నిర్వహించే రైతు పండుగ కార్యక్రమంలో పాల్గొని, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంటల ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గత మూడు రోజులుగా జిల్లా నుండి అనేక మంది రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను, సందేహాలను శాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. నేటి రైతు పండుగ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని రైతువేదికల్లో ఏర్పాటు చేసి రైతులతో కలిసి ఆయా మండలాల అధికారులు వ్యవసాయ అధికారులు పాల్గొని వీక్షించినట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగ సదస్సులో రేవంత్‌రెడ్డి ప్రసంగం

రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తున్న కలెక్టర్, రైతులు

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు

రూ.143.53 కోట్ల నిధులతో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అభివృద్ధి పనులకు రిమోట్ ద్వారా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం మహబూబ్ నగర్ జిల్లాలో ఏర్పాటు చేసిన రైతు పండగ కార్యక్రమంలో పాల్గొని ఉమ్మడి జిల్లాలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు రూ.143.53 కోట్ల నిధులతో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలో ఉర్దూ ఘర్, షాదీఖాన, శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణానికి రూ. 45 కోట్ల నిధులతో శంఖుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో 25 బి.టి రోడ్లకు రూ. 49.90 కోట్లు, తాండాల నుండి గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లను బి.టి రోడ్డుగా మార్చేందుకు రూ. 10.68 కోట్ల నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. మిడ్జిల్ నుండి కొత్తపల్లి కి వెళ్ళే బి.టి రోడ్డును రెండు వరసల రోడ్డుగా మార్చేందుకు రూ. 25 కోట్ల నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబ్‌నగర్ పోతులమడుగు వద్ద రూ. 2.65 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన మినీ స్టేడియంకు ప్రారంభోత్సవం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మానోపాడ్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అప్‌గ్రేడ్ కొరకు రూ. 3.25 కోట్లు, నందిన్నె కే.జి.బి.వికి రూ.2.70 కోట్లు, గట్టు కే జి.బి.వి కి రూ. 2.05 కోట్ల నిధుల పనులకు శంఖుస్థాపన చేశారు. అదేవి ధంగా గద్వాల సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ స్టోర్, ప్రభుత్వ వైద్య కళాశాలను వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేశారు.

పదేళ్లలో పాలమూరు ఎడారి

- టిఆర్ఎస్ వాళ్లు ఏడుస్తూనే ఉండండి..
- ధర్నాలు, ఉద్యమాలు చేస్తామంటే ఊరుకోం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త: టిఆర్ఎస్ వాళ్లు ఏడుస్తూనే ఉండండి. మేం రైతులకు పండుగలు చేసుకుంటూ ముందుకు పోతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం సాయంత్రం ఆయన మహబూబ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన రైతు పండుగ బహిరంగ సభలో ప్రసంగించారు. ఏడ్చేవాళ్లే టిఆర్ఎస్ తో ఉంటారు. పండుగ చేసుకునేవారు కాంగ్రెస్ ప్రభుత్వంతో ఉంటారని అన్నారు. మీరు ధర్నాలు, ఉద్యమాలు చేస్తాం అంటే చూస్తూ ఊరుకోము. ఏ అంశాన్ని వదిలి పెట్టకుండా చెప్పినవన్నీ చేసుకుంటూ ముందుకు పోతాం అని అన్నారు. పదేళ్లపాటు పాలించిన మీలాగే మేము ఉంటామని అనుకోవద్దని బిఆర్ఎస్ నేతలకు డిప్యూటీ సీఎం హితవు పలికారు. ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాల ఫలితమే ఈనాటి పండుగకు కారణం అన్నారు. ప్రతి ఏడాది ఈ పండుగ చేస్తామని తెలిపారు. ఏడాది కాలంలోనే ప్రజల వద్దకు వెళ్తాం, నిలదీస్తాం అంటే నవ్వొస్తుంది, పదేళ్లు పాలించిన మీరు రైతులకు చేసిన మేలు ఒక్కటి లేదని చెప్పడానికి నాకు ఎలాంటి సందేహం లేదని డిప్యూటీ సీఎం అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని 10 ఏళ్ల పాటు పాలించిన మీరు ఏ ఒక్కటి పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణ జలాలను రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు అందించాలని నాటి సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి జీవో జారీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. పాలమూరును ఎడారిగా మార్చింది గత పాలకులే అన్నారు. నల్లగొండ జిల్లాలో ప్రారంభించిన శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టు వద్ద సమీక్ష చేశామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి సమీక్ష చేశామని కృష్ణానదిపై సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రతినెల బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. గత పాలకులు గోదావరిపై ఏమన్నా చేశారా అంటే కాళేశ్వరం కుదవపెట్టి మేడిగడ్డ అన్నారు. బ్యారేజీలను కుప్పకూల్చారని విమర్శించారు. మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళిక మూలంగా కాళేశ్వరం నీళ్లు లేకుండానే 66.77 లక్షల ఎకరాల్లో 153 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక రికార్డు అని అన్నారు. లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పిన మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు వాయిదాల్లో మాఫీ చేశారు. మీరు చేసిన మాఫీ రైతుల వడ్డీలకే సరిపోలేదు. రెండోసారి అదికారంలోకి వచ్చిన తర్వాత అరకొరగా చేసి చేతులు దులుపుకున్నారు. ఆగస్టు 15లోగా 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి 15 రోజుల్లోనే 18 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేశాం. దేశ చరిత్రలోనే ఇది ఒక రికార్డు అన్నారు. ఆధార్ కార్డు నెంబర్లు సరిగా లేక, ఇతర సాంకేతిక ఇబ్బందులతో నిలిచిపోయిన రైతుల రుణమాఫీ వివరాలను ఇంటింటికి వెళ్లి సేకరించాం. ఆ విధంగా నిలిచిపోయిన 3.20లక్షల మంది రైతుల వివరాలు సరిచేసి 3000 కోట్ల రూపాయలు ఈరోజు వారిఖాతాలో జమచేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలపట్ల నీలాగా దుప్పటి కప్పుకొని పడుకోలేదని,మీపదేళ్ల పాలనలో పంట నష్టం పరిహారాన్ని పట్టించుకోలేదు. మేము అధి కారంలోకి రాగానే పంట నష్టపోయిన రైతులకు రూ.100కోట్లువిడుదల చేశామన్నారు.రైతు బీమా పథకం కింద వారి పక్షాన ప్రభుత్వమే రూ.1,433 కోట్లు ప్రీమియం చెల్లించిందని తెలిపారు. పంటల భీమా కోసం – మిగతా4లో..

ప్రసంగిస్తున్న డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం

జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్‌కుమార్

విద్యార్థులతో మాట్లాడుతున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

తెలకపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త: గురుకుల, సంక్షేమ హాస్టల్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురవుతున్న వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు(ఏఐఎస్ఎఫ్) (ఏఐవైఎఫ్) శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ మండలంలో విజయవంతమైనట్లు ఏఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశముని ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకుని విద్యాశాఖ మంత్రి నియమించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లవి, శ్రీకాంత్, లక్ష్మి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కృష్ణ,నవంబరు30 ప్రభాతవార్త:రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ సంఘటనలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్తంగా బంధు పిలుపు నివ్వడం జరిగింది. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగానే కృష్ణ మండల కేంద్రంలో బంద్ నిర్వహించడం జరిగింది.ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకుండా సరియైన చర్యలు తీసుకోకుండా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరిస్తున్నదని,అలాగే ప్రభుత్వ పాఠశాలలో సామాజిక వసతి గృహాల్లో గురుకులాల్లో కేజీబీవీలో అనేక సమస్యలతో సమతమవుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నది అన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడం వల్ల రాష్ట్రంలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటన జరుగుతున్నాయి. ఈ ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరగడానికి కారణం విద్యారంగానికి అతి తక్కువ నిధులు కేటాయించడమేనని, అలాగే మధ్యాహ్నం భోజనం పెరిగిన ధరల కనుగుణంగా ధరలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింలు, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సూర్య ప్రకాష్ నాయుడు మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా గడ్డి జాతి విత్తనాలు పంపిణీ

ఉచితంగా అందజేసిన గడ్డి జాతి విత్తనాలు

బిజినేపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త: పాడి పశువులలో అధికపాల ఉత్పత్తికి అవసరమైన వివిధ రకాల గడ్డి జాతి విత్తనాలు శనివారం మహాదేవుని పేటలో పాడి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ఉద్దేశించి ప్రాంతీయ పశుగ్రాస కేంద్రం హైదరాబాద్ సీనియర్ శాస్త్రవేత్త డా.అంజు బాసేరా మాట్లాడుతూ పాడి రైతులందరూ తప్పనిసరిగా అధిక పోషక విలువలు కలిగిన స్వల్ప కాలిక రకాలను పెంచుకోవాలన్నారు. పి సి 23, మొక్కజొన్న, సజ్జ,దీర్ఘకాలిక రకాలైన కో 29,సూపర్ నేపియర్,స్మార్ట్ నేపియర్, ఛాయా ట్రీ రకాలను సాగుచేసి అధిక పాల దిగుబడిని సాధించాలని సూచించారు .40 మంది గ్రామ పాడి రైతులకు ఒక్కొక్కరికి ఒక కెజీ మల్టి కట్టింగ్ గడ్డి కో29 విత్తన కిట్ల ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ప్రాంత పాడి రైతులకు అవసరమైన గడ్డి జాతి విత్తనాల కోసం హైదరబాద్‌లో గల వారి కార్యాలయంలో సంప్రదించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గోసంరక్షణ పరిరక్షకురాలు విజయ రెడ్డి, గ్రామ పాడిరైతులు యల్లస్వామి,ఆంజనేయులు,సత్యనారాయణ,శివ, యు.రాజు,బాలయ్య, రామచేంద్ర,నాగిరెడ్డి, నవీన్‌రెడ్డి, మాధవరెడ్డి,నాగరాజు,పి.తిరుపతి,మారుతి,తిరుపతి,గ్రామస్తులు రాజేందర్ రెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్

విద్యార్థులతో మాట్లాడుతున్న సంఘాల నాయకులు

బాలానగర్, నవంబరు 30 ప్రభాతవార్త : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. బాలానగర్ ప్రభుత్వ బాలుర, మరియు బాలికల పాఠశాలలను బంద్ చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసిన కూడా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ అయి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. కనీసం విధార్థులకు నాణ్యమైన భోజనం కూడా అంధిచే పరిస్థితిలో ప్రభుత్వం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల పట్ల ఎటువంటి కనికరం లేకుండా ఇంత నిర్లక్ష్యం పనికిరాదని, ఇప్పటికైనా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంటి, హమీద్, ఆనంద్, వెంకట్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదిరి ఎన్నికల నిర్వహించిన శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాల

ఓటుహక్కు వినియోగించుకుంటున్న విద్యార్థి

మాగనూరు,నవంబరు 30 ప్రభాతవార్త : మండల పరిధిలోని శ్రీ ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం మాదిరి ఎన్నికలు నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ ఏ విధంగా నిర్వహిస్తారో తెలియజేస్తూ మరియు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకులు ఓటర్లు నమోదు చేయించుకుని ప్రతి ఒక్కరు ఎలక్షన్ లో భాగస్వాములు కావాలని తమ ఇండ్లలో ఉన్నవారిని ఓటర్లుగా నమోదు చేయించడమే కాక రాబోయే ఎన్నికలలో ఓటు వేసే లా విద్యార్థులను కోరారు. అనంతరం పాఠశాలలో జనరల్ ఎలక్షన్ మాదిరి ఓటింగ్ చేయించడం జరిగింది పెద్ద ఎత్తున ఎన్నికలలో పాల్గొని ఓటర్ల చైతన్యాన్ని నింపారు దాదాపుగా 6 మంది పోటీలలో పాల్గొనగా వేదాంత్ గెలుపొందడం జరిగింది. విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ బాధ్యతల పేరుతో విద్యార్థులను ఎన్నికలలో భాగస్వాములను చేసి తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణ విద్యార్థులు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం నరసింహులు ,ఏసు, వన్నెష్, సురేష్, హనుమంతు, స్వర్ణలత, లక్ష్మి, సంధ్య, భారతి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన వాల్య నాయక్



టిపిసిసి అధ్యక్షుని కలిసిన వాలియా నాయక్

బిజినపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త: గాంధీభవన్లో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ లీడర్‌షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో శనివారం తెలంగాణ టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ లను ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ వాలియానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి నట్లు తెలిపారు. ఏఐసిసి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచన మేరకు జనవరి మొదటి వారంలో ఆదివాసి గిరిజన లంబాడా తెగలను మోటివేట్ చేస్తూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఆదివాసి గిరిజన నాయకులు ఈరోజు గాంధీభవన్‌లో సమావేశం అయినట్లు వివరించారు.

రైతు పండుగ సభకు మక్తల్ రైతుల ప్రభంజనం

వేలాది సంఖ్యలో తరలిన రైతన్నలు

వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

సీఎం సభకు వెళ్తున్న కార్యకర్తల వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మక్తల్ టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఎడాది పూర్తికావస్తున్న సందర్భంలో పాలమూరు జిల్లా కేంద్రంలో రైతు పండుగ సభకు పెద్ద ఎత్తున మక్తల్ నియోజవర్గం నుంచి రైతన్నలు తరలివెళ్లగా నియోజవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి వాహనాలను ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యి కేవలం ఒక్క ఏడాదిలోనే రైతుల సంక్షేమం కోసం 54 వేల 280 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఇందులో రెండు లక్షల రుణమాఫీ కింద దాదాపు 22 లక్షల మందికి పైగా రైతులకు 18 వేల కోట్లు వారి ఖాతాలో జమ చేసామని అన్నారు. దీంతోపాటు ఉచిత విద్యుత్ పెట్టుబడి సాయం రైతుబీమా,పంట నష్టంకింద ఎకరానికి రూ.10000 ఆర్థిక సాయం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఇతర వ్యవసాయ సబ్సిడీల రూపంలో కేవలం ఏడాదిలోనే రూ.54,000 కోట్లకు పైగా ఖర్చు చేశామని ఇంత భారీ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వము ఖర్చు చేయలేదని అన్నారు రైతన్నల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు, రైతు పండుగ సభకు తరలినారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, మక్తల్ టౌన్ అధ్యక్షులు రవికుమార్, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, కట్టా సురేష్ ,మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్, మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతన్నలు తదితరులు ఉన్నారు.

పౌరహక్కులపై పోలీసులు, రెవెన్యూ అధికారుల అవగాహన

అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణపేట టౌన్, నవంబర్ 30 ప్రభాతవార్త : ప్రతినెల చివరి తేదిన పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) సందర్భంగా శనివారం నారాయణపేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేదని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరాని తనాన్ని, కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది. అన్నికులాలకు చెందిన వారిని వారితో సమావేశం నిర్వహించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టం 1989 ఈచట్టం యొక్క విశిష్టత , వినియోగించే విధానాల గురించి, పిఓఎ ,(పోక్సో చట్టం), పిసిఆర్ (పౌర హక్కుల రక్షణ చట్టం) చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురా వడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు. పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరు గుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమ్మత్యగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.

మక్తల్‌లో ప్రభుత్వ పాఠశాల బంద్ విజయవంతం

పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ, అంబేద్కర్ యువజన సంఘం

విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మక్తల్ టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కలుషితానికి కారకులను శిక్షించాలని రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజనంలో అనేకమంది విద్యార్థులు అనారోగ్యాల గురైన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రి నియమించాలని వామపక్ష విద్యార్థి సంఘాల, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మక్తల్ ప్రాంతంలో బందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బంద్ నిర్వహించి రాస్తారోకో నిర్వహించడం జరిగింది ఈ రాస్తారోకోకు అజయ్ పిడిఎస్‌యు, జిల్లా నాయకులు అధ్యక్షత వహించగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ ,ఎస్ఎఫ్ఐ నాయకులు నయ్యుమ్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడడం జరిగింది. మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ గల కారణాలను బయటకు చెప్పాలని డిమాండ్ చేశారు లేనియెడల మా సంఘాల ఆధ్వర్యంలో మరింత ఉద్యమాన్ని ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు వెంకటేష్, రమేష్, శివ, భానుచందర్, అఖిల, సంగీత అనూష, పౌర్ణమి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రమేష్, తేజ, సురేష్, రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేందర్ రమేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు భారీగా తరలివెళ్లిన రైతన్నలు

రైతులతో కలసి సభకు వెళ్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి

గద్వాల, నవంబరు 30 ప్రభాతవార్త : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గం నుండి మహబూబ్‌నగర్ లో జరిగిన రైతు పండుగ బహిరంగసభకు పెద్ద ఎత్తున రైతులు, మహిళా రైతులు తరలివెళ్ళారు. ప్రగతి పథం, సకల జనహితం, మన ప్రజా ప్రభుత్వం అంటూ రైతు పండుగకు సుమారు 10 వేల మంది రైతులు బయలుదేరి వెళ్లారు. రైతన్నలకు అభినందనలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ సభకు వెళ్తున్న రైతులు నాయకులతో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కూడా వెళ్లారు. ఆయన వెంట మాజీ చైర్మన్ లు గడ్డం కృష్ణా రెడ్డి, బండారి భాస్కర్,జి. వేణుగోపాల్, మాజీ జడ్పిటీసి లు ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, మాజీ ఎంపిపిలు ప్రతాప్ గౌడ్, విజయ్, రాజారెడ్డి,సత్యారెడ్డి,మధుసుధన్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ లు శుభాన్, తిమ్మారెడ్డి,కాంగ్రెస్ నాయకులు విక్రమ్ సింహా రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, తుమ్మల నర్సింహులు, సతీష్, మోహన్ రెడ్డి, చిన్న రాజు, వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్ లు నరహరి గౌడ్, శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ లు నాగేందర్ యాదవ్, నెమలి కంటి ఆంజినేయులు, వంట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. మోహన్ రెడ్డి టీం ఆధ్వర్యంలో భోజనాలు ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి సహకారం తో సుమారు 10 వేల మందికి పుటాన్ పల్లి సమీపంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ యువ నాయకుడు మోహన్ రెడ్డి సారథ్యంలో 10 వేల మంది రైతులకు భోజనాలు వడ్డించారు.

భోజనం వడ్డిస్తున్న మోహన్ రెడ్డి, సుభాస్, పత్రాప్ గౌడ్, వెంకట్ రాములు

నిర్మానుష్యంగా ఆత్మకూర్ బస్టాండ్.. అవస్థల్లో ప్రయాణికులు

ఆత్మకూర్ ప్రయాణ ప్రాంగణం

ఆత్మకూరు నవంబరు 30 ప్రభాతవార్త : మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోనీ ప్రభుత్వ ప్రయాణ ప్రాంగణం శనివారం ఉదయం 11 గంటలకు కూడా నిర్మానుష్యంగా మారిపోవడంతో ప్రయాణికులు చాలామంది తీవ్ర ఇక్కట్ల గురయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి రైతు పండుగ సదస్సుకు ఆర్టీసీ బస్సులను మొత్తంగా సదస్సు కోసం పంపించడంతో ప్రతినిత్యం ఆత్మకూరు నుండి ఇతర ప్రాంతాలకు ఇతర ప్రాంతాల నుండి ఆత్మకూరుకు వచ్చే ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. కేవలం ఆత్మకూరు నుండి వనపర్తికి ప్రతినిత్యం 27 బస్సు సర్వీసులు కొనసాగుతుండగా శనివారం రోజు రైతు పండుగకు బస్సులను పంపించడంతో ఒక్క బస్సు కూడా నడవకపోవడంతో పలువురు ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు అంతేకాకుండా ఆత్మకూరు నుండి మహబూబ్‌నగర్ ఆత్మకూరు నుండి గద్వాల్ ,ఆత్మకూరు నుండి నారాయణపేట తదితర ప్రాంతాలకు ప్రతినిత్యం దాదాపు 3,000 మందికి పైబడి ప్రయాణికులు ప్రయాణిస్తుండగా శనివారం మాత్రం ఆత్మకూరు బస్టాండ్ నిర్మానుష్యంగా మారిపోవడంతో పలువురు విశేషంగా చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ బస్సులను మొత్తం ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండుగ సదస్సుకు పంపించడంతో సంతట్లో సడేమియా అనుచందంగా శనివారం రోజు ప్రైవేటు వాహనాలకు ప్రజలు ఎగబడడంతో ప్రయాణికులకు అదనపు చార్జీలతోపాటుగా ప్రైవేటు వాహనాల యజమానులకు కాసులు కురిపించడం విశేషం.

పెద్దదిన్నెలో పౌర హక్కుల దినోత్సవం

ఇటిక్యాల నవంబరు 30 ప్రభాతవార్త : మండల పరిధిలోని పెద్ద దిన్నె గ్రామంలో శనివారం గ్రామ చావిడి దగ్గర గ్రామస్తులతో కలిసి ఆర్.ఐ.లు భీమ్ సెన్ రావు. మధు పాల్గొని పౌర హక్కుల దినోత్సవం పై గ్రామ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్ఐ భీమ్ సేన్ రావు మాట్లాడుతూ గ్రామంలో కుల మతాలకు అతీతంగా అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి సోదర భావంతో ఉండాలని దళితుల పట్ల వివక్షత చూపరాదని గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా బజరంగ్ దళ్ గోరక్ష ప్రముఖ్‌గా సందీప్

చిన్నచింతకుంట,నవంబరు30 ప్రభాతవార్త: పాలమూరు జిల్లాలో నవంబర్ 29,30వ తేదీన జరిగినటువంటి బజరంగ్ దళ్ నివాసి వర్గలో భాగంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ప్రాంత ప్రముఖుల ఆధ్వర్యంలో బజరంగ్ దళ్ పాలమూరు జిల్లా గోరక్ష ప్రముఖ్‌గా మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన సందీప్ నాయుడుని ఎంపిక చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మం కోసం అనునిత్యం పోరాటం చేస్తానని,ధర్మ మార్గంలో ఎన్ని ఆటంకాలు ఎదురైన హిందూ సమాజం కోసం హిందూవులలో చైతన్యం తేవడానికి ముందుంటానన్నారు.ఎక్కడ గోవులను కబేళాలకు తరలించకుండ అడ్డుకుంటానని, ప్రాంత ప్రముఖులు నా పై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సనాతన ధర్మ పరిరక్షణకై శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు

బిజినేపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త: బిజినేపల్లి శివారులోని ఎంజెఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన శీర్ణం మహేష్ యాదవ్,వడ్డే శివప్రసాద్ బైక్ పై సొంత గ్రామానికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీబస్సు ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇరువురిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరు యువకులను హైదరాబాద్ తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

సీఎం రేవంత్ సభకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

చిన్నచింతకుంట,నవంబరు 30 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నను రాజును చేయడమే ప్రధాన లక్ష్యంతో రైతు రుణమాఫీ, సన్న బియ్యానికి బోనస్ రూ.500 అందిస్తూ రైతు సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా మహబూబ్‌నగర్‌జిల్లా అమిస్తాపూర్‌వద్ద రైతుపండుగ పేరిట నిర్వహిస్తున్న మూడురోజుల కార్యక్రమానికి శనివారం రైతు పండుగకు రానున్న సీఎం రేవంత్ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్‌శ్రేణులు,రైతులు,మహిళలు భారీగా తరలివెళ్లారు.

నేడు విద్యార్థులకు వ్యాస రచన,వక్తృత్వ పోటీలు

దేవరకద్ర, నవంబరు 30 ప్రభాతవార్త : ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా కౌకుంట్ల మండలంలోని ఉన్నతపాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక శక్తి అనే అంశం పై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను డిసెంబర్ 1 వ తేదిన ఉదయం 10 గంటలకు కౌకుంట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండలవిద్యాధికారి మంజులత ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని హైస్కూల్ పాఠశాల హెచ్ఎంలు 8,9,10 తరగతుల నుండి మీడియంకి ఇద్దరు విద్యార్థుల చొప్పున పోటీలకు పంపాలని సూచించారు. కాగా పోటీలకు హాజరయ్యే విద్యార్థుల వెంట విధిగా ఇద్దరు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రైతు పండుగకు తరలి వెళ్లిన నాయకులు రైతులు

ఇటిక్యాల నవంబరు 30 ప్రభాతవార్త : ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని భూత్పూర్ మండలం అమిస్తాపూర్ లో మూడు రోజుల పాటు రైతు పండుగను ప్రభుత్వం నిర్వహిస్తుంది. శనివారం చివరి రోజు రైతు పండుగ సభకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి హాజరయ్యే రైతు పండుగ సభకు మండలం నుండి 9ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారని ఎంపీడీవో మహమ్మద్ అజార్ మొహియుద్దీన్ తెలిపారు. అలాగే ఐకెపి అధికారులు వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బస్సులలో తరలించారు. అంతేకాక ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు మండలం నుండి కాంగ్రెస్ ముఖ్య నాయకులు జోగుల రవి, లక్ష్మినారాయణ రెడ్డి, వెంకటేష్ యాదవ్, తదితరులు రైతు పండుగ సభకు తరలి వెళ్లారు. అంతేకాక అల్లంపూర్ నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు. రైతులు కార్యకర్తలు తరలి వెళ్లారు.

మాగనూరులో...

మాగనూరు,నవంబరు 30 ప్రభాతవార్త : మాగనూరు మండల కేంద్రంలోని మహబూబ్‌నగర్ లో ఏర్పాటుచేసిన రైతు పండుగ అనే కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, రైతులు కాంగ్రెస్ కార్యకర్తలు మాగనూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో బయలుదేరడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇది ప్రజల ప్రభుత్వమని శనివారం నిర్వహిస్తున్నటువంటి ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు మరిన్ని పథకాలు అందించేలా అభివృద్ధి వైపు రాష్ట్రం అడుగులు వేసేలా ఈ యొక్క కార్యక్రమం నిర్వహిస్తుందని ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొంటున్నారని విలేకరుల సమావేశంలో తెలియజేయడం జరిగింది.

న్యాయాన్ని కాపాడడంలో లాయర్ల పాత్ర కీలకం

■ లా కాలేజ్ ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

లా కాలేజ్ ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న ఎమ్మెల్యే

వనపర్తి ప్రతినిధి నవంబరు 30 ప్రభాతవార్త: న్యాయాన్ని న్యాయ వ్యవస్థను కాపాడడంలో లాయర్ల పాత్ర కీలకంగా ఉంటుందని లాయర్లందరూ ప్రతినిత్యం న్యాయాన్ని కాపాడాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. వనపర్తి పట్టణంలోని లక్ష్మి కృష్ణ గార్డెన్‌లో శనివారం నిర్వ హించిన ఎస్‌డిఎం లా కాలేజ్ ప్రథమ వార్షికోత్సవం, ప్రెషర్స్ డే కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై మాట్లాడారు. ఎలాంటి హోదాలోఉన్న వ్యక్తులను సైతం ప్రశ్నించే హక్కు కేవలంన్యాయవాదులకు మాత్రమే ఉంటుందని ఇలాంటి న్యాయవాద విద్యను అభ్యసించే ప్రతి ఒక్క విద్యార్థిన్యాయాన్ని కాపాడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ చాలా పటిష్టమైనదని సందర్భాలు వేరైనా కాలాతీతమైన న్యాయమే గెలుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పరీక్షలలో ఉత్తమ ప్రథమ కనిపించిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆయన మెడళ్లను బహుక రించారు. అదేవిధంగా మొదటి సంవత్సరం విద్యాభ్యాసం కోసం కాలేజీలో చేరిన విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కర్, కళాశాల ఎగ్జిక్యూటివ్ నెంబర్ అనంతరాజు, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ ప్రముఖ వైద్యుడు పగిడాల శ్రీనివాస్, పొల్కేపహాడ్ గ్రామ మాజీ సర్పంచ్ సత్యశీల రెడ్డి కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దొంగ దీక్ష చేసి ధనవంతుడయ్యాడు

విలేకరుల సమవేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల నవంబరు30 ప్రభాతవార్త: కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బిఆర్ ఎస్ నాయకులకు మీకు లేదని శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సరిత క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధికారం ప్రతినిధి శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్ మాట్లాడుతూ సకలజనుల సౌభాగ్యమే కాంగ్రెస్ ధ్యేయం అన్నారు. అన్ని కుల,మతాలను సమానంగా అభివృద్ధి చేయడమే, కాంగ్రెస్ నైజం కాంగ్రెస్ పెట్టిన భిక్ష వల్లనే బిఆర్ఎస్ పార్టీ నాయకులు 10 సంవత్సరాలు పరిపాలన చేస్తారన్నారు. ఇది మరిచి మాట్లాడే వారు మూర్ఖులన్నారు. ఎందుకంటే తెలంగాణ పేరు చెప్పి దొంగ దీక్ష చేసి ధనవంతుడు అయ్యాడ న్నారు. మరి అదే తెలంగాణ కోసం మరణించిన అమర వీరుల వారి కుటుంబాలు మరుగున పడి పోయాయి. ఉద్యమాలు చేసిన వారు ఒసే లేకుండా పోయారు. ఇది గత ప్రభుత్వ చరిత్ర గత పది ఏళ్ల పాలనలో,అగ్రకులాల వారే ఆధిపత్యం చెలాయిస్తూ, బాగుపడడం జరిగింది. కానీ అప్పులు చేసుకొని ఉద్యమాలు చేసిన వారి పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. అందుకే గత ప్రభుత్వాన్ని సకలజనులు కూకటి వేళ్ళతో పెకిలించారు. అనేది గుర్తుంచుకోవాలి. కెసిఆర్ దొంగ దీక్ష వలన తెలంగాణ రాలేదు అనేది జగమెరిగిన సత్యం. కేవలం సకలజనులు పోరాడితేనే కాంగ్రెస్ పార్టీ గుర్తించి తెలంగాణ కలను సహకారం చేసింది. ఇది గత అసెంబ్లీలో కేసీఆర్ ఒప్పుకున్నాడు. టిఆర్ఎస్ నాయకులు అందితే జుట్టు అందకపోతే కాళ్లు అన్న చందంగా ఉంది. ఇకనైనా మీ ఊక దంపుడు ఉపన్యాసాలు మాని, అభివృద్ధి వైపు నడిపిస్తున్న కాంగ్రెస్ పార్టీకి సహకరించాల్సిందిగా కోరుతున్నాం. లేకపోతే గత పార్లమెంట్ ఎన్నికలలో పట్టిన గతే భవిష్యత్తులోనూ పడుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తాలుకా సీనియర్ నాయకులు శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, భాస్కర్ యాదవ్, అల్వాల రాజశేఖరరెడ్డి, ధరూర్ రవి,జయకృష్ణ, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

వాక్యాలను వెనక్కి తీసుకోవాలి

గద్వాల నవంబరు 30 ప్రభాతవార్త: బీర్లు,బిర్యానీల గురించి వీడియోలు చేసే మీకు ఏం తెలుసు విద్యార్థుల బాధలు అంటూ కొండ సురేఖపై ఆర్.కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల విద్యార్థులకు భోజనం ప్రభుత్వం సక్రమంగా పెట్టక ఆర్ఎస్ ప్రవీణ్‌పై సంచలన వాక్యాలు కొండ సురేఖ సరికాదు అని అన్నారు. వాక్యాలను వెనక్కి తీసుకోవాలని ఆర్.కిషోర్ డిమాండ్ చేశారు. బీర్లు, బిర్యానీలు, రేవ్‌పార్టీల గురించి వీడియోలు చేసే మీకువిషాహారం తిని తల్లడిల్లుతున్న విద్యార్థుల బాధ అర్థమవుతుందా? అని ప్రశ్నించారు. ఒక మాతృమూర్తిగా కుట్ర జరిగిందని మీరు మాట్లాడాల్సిన మాటలేనా? అని ప్రశ్నించారు. కొండా సురేఖ స్థాయికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు దిగజార దల్చుకోరు అని అన్నారు. పేదగురుకుల విద్యార్థుల గురించిమాట్లాడేఅర్హత మంత్రి కొండ సురేఖ గారికి లేదని మండిపడ్డారు. సభ్యత, సంస్కారం,మానవత్వం అంటే ఎంటోకొండా సురేఖకు తెలియదని విమర్శించారు. బీర్లు, బిర్యా నీలు, రేవ్ పార్టీలు చేసుకుంటూ విద్యార్థుల జీవితాలు నాశనం చేసిన సురేఖకు పేద గురుకుల విద్యార్థుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. దమ్ముంటే గురుకులాల విషయంలో బహిరంగ చర్చకు రావాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున సవాల్ విసిరారు.

ఎంజెపి పాఠశాలను సందర్శించిన పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి

విద్యార్థులకు వడిస్తున్న ఆహారాన్ని పరీక్షిస్తున్న పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి

పెబ్బేరు నవంబరు 30 ప్రభాత వార్త: పెబ్బేర్ పట్టణంలోని ఎంజెపి పాఠశాలను పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాలా యుగంధర్ గౌడ్ ఆదేశానుసారం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి వెంకటన్నగౌడ్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని అన్నం పప్పు కూర గాయలను తనిఖీ చేశారు. విద్యార్థులతో వెంకటన్నగౌడ్ మాట్లాడుతూ ఆహారం మంచిగా ఉందా లేదా గుడ్లు పాలు ఆహారం టైం టేబుల్ ప్రకారంగా భోజన వసతి కల్పిస్తున్నారా లేదా లేని విషయంలో తనకు తెలియజేయాలని విద్యార్థులను అడిగారు. ప్రస్తుతం అలాంటి సమస్యలు ఏమీ లేవని ఉన్నచో సంప్రదిస్తామని విద్యార్థినిలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు విద్యార్థినిలు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన పేట దివ్యాంగులు

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నారాయణపేట టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 27, 28 తేదీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వికలాంగుల క్రీడా పోటీలలో నారాయణపేట జిల్లా దివ్యాంగ క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో జిల్లా నుంచి జోసెఫ్, మోనిక, ఆశమ్మ, జ్యోతి, నాగమ్మ,ఆంజనేయులు, లక్ష్మి, శిరిష,పాల్గొనగా జోసెఫ్ షాట్‌పుట్ బాలుర ఆర్థోపెడిక్ జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించగా, సీనియర్ అంధుల రన్నింగ్ మరియు షాట్ పుట్ లో రెండవ బహుమతులను నాగమ్మ గెలుచుకుంది. అలాగే ఆర్థోపెడిక్ జూనియర్ విభాగం క్యారమ్స్‌లో శిరీషా రెండవ బహుమతి సాధించి, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. శైలజ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కాగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను శనివారం జిల్లా సంక్షేమ అధికారి జయ, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

సగర సంగం గ్రామ కమిటీ ఎన్నిక

గ్రామంలో ఎన్నికైన సగర సంగం గ్రామ కమిటీ

బిజినపల్లి, నవంబరు 30 ప్రభాత వార్త: షాయిన్ పల్లి గ్రామంలో సగర సంగం కమిటీని జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంటి కురు మూర్తి,ప్రధాన కార్యదర్శిగా రాసూరి బంగారయ్య,కోశాధికారిగా బీషం శివ, గౌరవ అధ్యక్షులుగా సైదులు, ఉపాధ్యక్షులుగా స్వామి, సహాయ కార్యదర్శిగా శ్రీశైలం, ప్రచారకార్యదర్శిగా బీశం నరేందర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సగరసంగంనాయకులు సూరంపల్లి సుధాకర్ చంద్రనారాయణ అధినారపు వెంకటేష్ అధినాయరపు బంగారయ్య బీసం కుర్మయ్య మాదంశెట్టి దస్తగిరి బంగారయ్య కొండయ్య సురేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అర్థిక సాయం

కల్వకుర్తి, నవంబరు 30 ప్రభాతవార్త: కల్వకుర్తి పట్టణానికి చెందిననార్లకంటి శేఖర్ ఇటీవల అకాలంగా మృతి చెందారు. అతని భార్య కూడా గతంలోనే మృతి చెందగా మృతుడి ఇద్దరు పిల్లలు నిరాశ్రయులయ్యారు. సమాచారం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాగరాజుగౌడ్, మాజీ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ మృతుడి శేఖర్ పిల్లలకు చేయూత ఉంటామని చెప్పారు. మిత్ర ఫౌండేషన్ సభ్యులు, మృతుని పిల్లలు ఉన్నారు.

రైతు పండగకు తరలిన రైతులు, నాయకులు

- జెండా ఊపి ప్రారంభించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి

రైతు పండుగ సదస్సుకు తరలివెళ్తున్న దృశ్యం

రైతు పండుగ సదస్సుకు తరలివెళ్తున్న దృశ్యం

బైరంపల్లి : రైతు పండుగ సదస్సుకు తరలివెళ్తున్న దృశ్యం

వెల్దండ, నవంబరు 30 ప్రభాతవార్త: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో చోటు చేసకుంటున్న రైతు పండుగ సంబురాల సందర్భంగా శనివారం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పాల్గొనే రైతు పండుగకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 30 ఆర్టీసీ బస్సుల్లో వ్యవసాయ శాఖ అధికారులు శోభారాణి,మంజుల,తహసిల్దారు కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఏపిఎం రాములునాయక్ పర్యవేక్షణలో బయలుదేరుతున్న బస్సులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనివిని ఎరుగని రీతిలో రైతు పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు మండలం నుండి దాదాపు 12,000 మంది రైతులు మహిళలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతన్న సంక్షేమానికి పెద్ద పీట వేశారని, ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని, సన్నవడ్లకు రూ.500బోనస్ ఇచ్చి నేడు రైతు పండుగను నిర్వహించుకుంటున్నామని,రైతును రాజును చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పిసిబి మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్ యాదవ్,కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, జక్కుల చిన్న జంగయ్య యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్,నాయకులు పుల్లయ్య, హమీద్, అలీ, రషీద్, కృపానందం,రాజశేఖర్,కేశమల్ల కృష్ణ, శంకర్ నాయక్, పోలే రాజు, పంతుల్లానాయక్, రమేష్, కిష్టాల్, బాబా తదితరులు తరలివెళ్లారు.

పెబ్బేరు నవంబరు 30 ప్రభాతవార్త: పెబ్బేరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు నాయకులు మహిళా మణులు అధిక సంఖ్యలో మహబూబ్‌నగర్ పట్టణం అమిస్తాపూర్‌లో జరిగే రైతు పండుగ సంబరాలకు బయలుదేరారు. ఈ కార్యక్రమం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ ఆవరణ నందు వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి జెండా ఊపి వాహనశ్రేణిలో బయలుదేరారు. పెబ్బేరు ఉమ్మడి మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు మహిళలు నాయకులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని,వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచులు, గ్రామ అధ్యక్షులు,వార్డు ఇన్చార్జులు, మహిళా సంఘం ప్రతినిధులు, మహిళలు నాయకులు అధిక సంఖ్యలో బయలుదేరారు.

బిజినపల్లి, నవంబరు30 ప్రభాతవార్త: ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా పాలమూరులో రైతుపండగ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల రైతులు తరలి వెళ్లారు. ముఖ్య అతిథిగా హాజరవుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సభకు ఆయా గ్రామాల రైతులతోపాటు మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వీరితో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ అభిమానులు నాయకులు ప్రజా పాలన విజయోత్సవాలకు తరలి వెళ్లారు.

నారాయణపేట టౌన్, నవంబరు30 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ లో జరిగే రైతు పండుగ బహిరంగ సభకు శనివారం నారాయణపేట నియోజకవర్గం నుండి కాంగ్రెస్ శ్రేణులు, రైతులు , మహిళలు ఆర్టీసీ బస్సులు, తుఫాన్ వాహనాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలు తరలి వెళ్లారు. అంతకుముందు పలువురు మాట్లాడుతూ రైతుల శ్రేయస్సును కోరే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో నియోజకవర్గంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమన్నారు. రైతుల శ్రేయస్సును కొరే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, వివిధ మండలాల నాయకులు రైతులు మహిళలు ఉన్నారు.

కొత్తకోట నవంబరు 30 ప్రభాతవార్త: అమిస్తాపూర్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రైతు పండుగ సంబరాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కొత్తకోట మండలం ఆయా గ్రామాల నుండి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు సీఎం బహిరంగ సభకు వస్తున్నా సందర్భంగా రైతులనుకాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన సందర్భంలో 6 గ్యారెంటీలు అమలు చేస్తు రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం గురుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించునున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా మండల గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

■ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్

విద్యార్థినులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్

కల్వకుర్తి, నవంబరు 30 ప్రభాతవార్త: కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను (కేజీబీవీ) శనివారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యాలయంలో విద్యార్థులకు వసతులపై, ఆహారం వస్తువుల నిలువ చేస్తున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణ ఏ విధంగా ఉందని, విద్యార్థులకు ప్రతిరోజు పెడుతున్న భోజనం ఏ విధంగా ఉందని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి మున్సిపల్ కమిషనర్ భోజనం చేశారు. ప్రతి రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని,చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు తగుజాగ్రత్తలుతీసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో ఎమైనా సమస్యలు ఉన్నాయి అని మాట్లాడటం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్‌శివ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూరు నవంబరు30 ప్రభాతవార్త: మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రగతిశీల యోజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం తదితరులు శనివారం రోజు ప్రభుత్వ ఆసుపత్రిలో నీ వైద్యులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ మేరకు పి వై ఎల్ జిల్లా అధ్యక్షులుఆంజనేయులు పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక ప్రతినిత్యం ఇక్కడికి వచ్చే రోగులు తీవ్రె ఇక్కట్లకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తామని గత శాసనసభ్యులు, ప్రస్తుత శాసనసభ్యులు వాకిటి శ్రీహరి సైతం స్పష్టమైన హామీఇచ్చినప్పటికీ నేటి వరకు కార్యరూపం దాల్చకపోవడం ఇంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఆసుపత్రిలో డెలివరీలు చేయకపోవడం మూలంగా పలువురు ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి పెద్దఎత్తున ఆర్థిక సంక్షోభంలో కొరకు పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టణంలోని ప్రభుత్వ ఆసు పత్రిలో కనీస సౌకర్యాలు కల్పించి తక్షణమే గైనకాలజిస్ట్ వైద్యులను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో పిఏఎల్, పిడిఎస్సి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు రాజు జిలాని తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి సేవలు అభినందనీయం

● జిల్లా సాయుధ దళాల అదనపు ఎస్పీ వీరారెడ్డి

పదవి విరమణ పొందుతున్న ఏఎస్పైని సన్మానించిన జిల్లా సాయుధ దళాల అదనపు ఎస్పీ వీరారెడ్డి

వనపర్తి క్రైమ్ నవంబరు 30 ప్రభాతవార్త: పోలీస్ శాఖలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, వనపర్తి వివిధ పోలీస్టేషన్లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఎస్సైగా 36 సంవత్సరాల పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందుతున్న వనపర్తి జిల్లా ఆత్మకూరు ఏఎస్సై, బీచుపల్లిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా సాయుధ దళాల అదనపు ఎస్పీ వీరారెడ్డి శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించి వారి సేవలనుఅభినందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ, మాట్లాడుతూ.. పదవీ విరమణ సమయంలో ప్రతి ఉద్యోగికి సంతోషం, బాధ రెండూ ఉంటాయన్నారు. పదవీ విరమణ తర్వాత ఒక కొత్త జీవితం మొదలవుతుందని, ప్రతి ఒక్కరూ ఎదో ఒక వ్యాపకం పెట్టుకోవడం ద్వారా నచ్చిన రంగంలో ముందుకు సాగాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత ఖాళీగా ఉంటే నిరుత్సాహం ఏర్పడుతుందని అలా కాకుండా సంతోషంగా కుటుంబంతో గడపాలని చెప్పారు. పదవీ విరమణ తర్వాత వచ్చే మొత్తాలను ప్రయోగాలు చేయకుండా ప్రణాళికాయుతంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదని అయితే అదే సమయంలో ఉద్యోగం చేస్తూనే తమ కుటుంబాలను సంతోషంగా ఉండేలా చేసుకున్న పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ తర్వాత మరింత చురుకుగా జీవన విధానాన్ని మలచుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా కష్టపడి పని చేసినప్పుడే అందుకు తగిన గుర్తింపుతో పాటు ఉన్నత స్థానాలకు చేరుకోగలమన్నారు. పోలీస్ ఉద్యోగం ద్వారా ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం గర్వకారణమన్నారు. న్యాయం కోసం ఎదురు చూసే బాధితులకు అండగా నిలిచే అవకాశం పోలీసు ఉద్యోగం ద్వారా లభిస్తుందని, పోలీస్ ఉద్యోగం ఎంతో ఉన్నతమైనదని చెప్పారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన జీపీఫ్,ఇన్స్యూరెన్స్, భద్రత సాంక్షన్ బిల్స్ అందజేశారు. రావాల్సిన బెనిఫిట్స్‌ను త్వరగా అందేలా చూడాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, ఆత్మకూరు ఎస్సై, నరేందర్, సూపరింటెండెంట్లు, సయ్యద్ ఇంతియాజ్, రాజవర్ధన్, సినియర్ అసిస్టెంట్, వినోద్,ఎస్సీ సీసీ, మధు, పదవి విరమణ పొందుతున్న ఏ ఎస్సై,బీచుపల్లి, వారి కుటుంబ సభ్యులుజిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులను అభినందించిన జిల్లా కలెక్టర్

గద్వాల నవంబరు 30 ప్రభాతవార్త : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురష్కరించుకొని రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన గద్వాల జిల్లా దివ్యాంగులను జిల్లా కలెక్టర్ బి. యం.సంతోష్ అభినందించారు. రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీలో గద్వాల జిల్లాకు చెందిన 8 మంది దివ్యాంగులు ప్రతిభ కనబరిచి బహుమతులు పొందారని అన్నారు. చెస్ పోటీల్లో అర్చన, వీరేష్, మధు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందగా, షాట్‌ఫుట్, రన్నింగ్ లో మహేశ్వరి ద్వితీయ బహుమతి, ట్రై సైకిల్ లో నౌషాద్ ద్వితీయ బహుమతి పొందారని జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి ఈ సందర్భంగా తెలిపారు.

ఆదివారం నుండి అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 30 ప్రభాతవార్త: అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలో నూతనంగా డిగ్రీ అడ్మిషన్‌లు పొందిన వారు మరియు సెకండియర్, థర్డ్ ఇయర్ వారికి డిసెంబర్ 1 (ఆదివారం) నుండి తరగతులు ప్రారంభించనున్నట్లు నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్పల్ లీ.అంజయ్య తెలిపారు. 1,3,5వ సెమిస్టర్ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కళాశాలలో నిర్వహించే తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరగతులు కేవలం ఆదివారం మాత్రమే నిర్వహించబడునని తెలిపారు. మరింత సమాచారం కోసం 7382929779 నంబర్ ను లేదా కళాశాలలో సంప్రదించాలన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వెల్దండ, నవంబరు30 ప్రభాతవార్త: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎస్ఎస్ఏ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిర సన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, అది వీలుకాని పక్షంలో వెంటనే పేస్కేల్ అమలు చేస్తామని అప్పుడు మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలుపు కోవాలని కోరారు. లేని యెడల సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. క

తెగిన కేఎల్ఐ కాలువ

వెల్దండ, నవంబరు 30 ప్రభాతవార్త: వెల్దండ మండలం చెర్కూరు-బర్కత్ పల్లి సమీపంలోని లింగమయ్య గుట్ట దగ్గర కెఎల్ఐడి 82 కాలువకు శని వారం ఉదయం గండిపడి వృధాగా పొలాల్లోకి నీరు పారుతుంది. మండ లంలో కేఎల్ఐ డీ-82కు ఎక్కడో ఒక దగ్గర గండిపడుతూ సాగునీరు సాఫీగా ముందుకు కదలడం లేదు. అప్పటి కాంట్రాక్టర్ ఇరిగేషన్ అధికారులు కాలయాపన చేస్తూ నాసిరకం, అలసత్వం పనులతోనే కాల్వకు ఎక్కడో ఒక చోట గండిపడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని రైతులు మండిపడుతున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు కాల్వను పరిశీలించి పూడ్చాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.

జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత

ఇటిక్యాల, నవంబరు30 ప్రభాతవార్త: అల్లంపూరు పట్టణంలో వెలసిన ఐదవ శక్తి పీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత ఆల యాన్ని దర్శించుకుని పూజలు నిర్వ హించారు. అలాగే సినీ నటుడు రాజేం ద్రప్రసాద్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహిం చారు. వారికి ఆలయ ఈ. ఓ పురంధర్ కుమార్, అర్చకులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పాఠశాలలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదు

◆ పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ

నారాయణపేట టౌన్, నవంబరు 30 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన బోజనాలు అందించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ప్రభుత్వ పాఠశాల బంద్ సందర్భంగా శనివారం మండలంలోని ఉద్మల్‌గిద్ద కాన్‌కుర్తి, క్యాతన్‌పల్లి, కంసాన్‌పల్లి, ఇట్లా పూర్, మోగుల్ మడ్క నర్సాపూర్ గ్రామాల్లో బంద్ నిర్వహించారు. దామరగిద్ద మండల కేంద్రం లో విద్యార్థులచే గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అంభ భవాని చౌరస్తాలో పీడీఎస్ యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి పిడిఎస్‌యు రాష్ట్ర అధ్య క్షుడు పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ విద్యాశాఖ పూర్తిస్థాయి మంత్రిని కేటాయించాల న్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని అధికారుల పర్యవేక్షణను పెంచా లన్నారు. పాఠశాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎయు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీహరి, బాల్ రాజ్,అశోక్, భీమేష్, వెంకటేష్, పవన్ తోపాటు విద్యార్థులు ఉన్నారు.

టచ్ ఆర్గనైజేషన్ సందర్శన

టచ్ సంస్థలో పియు సోషల్ వర్క్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త: పాలమూరు యూని వర్సిటీ సోషల్ వర్క్ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు టచ్ స్వచ్ఛంద సంస్థను సందర్శించారు. సోషల్ వర్క్ కోర్సులో భాగంగా వివిధ స్వచ్ఛంద సంస్థలను సందర్శించి, పరిశీలించి ఆయా కార్యక్రమాల పైన అవగాహన పెంచుకునే క్రమంలో మహ బూబ్నగర్ జిల్లా కేంద్రంలో వినయ్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న టచ్ సంస్థను సందర్శించారు. సంస్థను ఏ విధంగా నేల్కొలుపాలి అనే అంశాలమీద పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా జైపాల్ అనే విద్యార్థి సంస్థలో ఆశ్రమం పొందుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ బండి పర్వతాలు, అంజలి, మహేందర్, ఆనంద్ మొదటి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యాసంస్థల బంద్

◆ ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి ◆ ఎస్ఎఫ్ఐ నేతల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కల్వకుర్తి, నవంబరు30 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నా యని, దీనికి నిరసనగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర పిలుపు మేరకు కల్వకుర్తి లో విద్యాసంస్థల బంద్ నిర్వహించామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయ కులు జమాలుద్దీన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ నిర్వహించాలని, అదేవిధంగా వంట కార్మికులకు వేతనాలు నెలల తరబడి బకా యిలు ఉన్నాయని వంట కార్మికులకు పెండింగ్లో ఉన్న బిల్లులు వేత నాలు వెంటనే చెల్లించాలని మరియు మధ్యాహ్నంభోజనం పథకం కోసం నిధులు పెంచి నాణ్యమైన భోజనం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమం లో రవూఫ్, రహ మాన్, సాయిచరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్దండ, నవంబరు 30 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలు గురు కులాలు, వసతి గృహాలలో చోటు చేసు కుంటున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు మండల కేంద్రంలో శనివారం పీడీఎస్‌యూ నాయకులు సంతోష్ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలనుబంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల అస్వస్థకు గురి కావ డంతో పాటు చనిపోతున్నారని, విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారం

ప్రధానోపాధ్యాయునికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెట్టడం లేదని విద్యాశాఖఅధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడు తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహ విద్యార్థు లకు నాణ్యమైన భోజన అందిం చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పాన్‌గల్ నవంబరు 30 ప్రభాతవార్త: ఇటీవల రాష్ట్రంలో అక్కడ క్కడ ప్రభుత్వ పాఠశాలలో గురుకుల పాఠశాలల్లో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్ రామంజి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు చేపట్టిన విద్యా సంస్థల బంద్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిం దన్నారు. సంబంధిత శాఖకు మంత్రి లేకపోవడమే కారణమని అన్నారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి చొరవ తీసుకొని విద్యా శాఖకు మంత్రిని నియమించాలన్నారు. విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. ఆయా పాఠశాలల్లో నాణ్యమైన సరు కులు లేకపోవడం రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫాయి జాన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. ఈ తరహా ఘటనలు జరగకుండా ముఖ్య మంత్రి ఎప్పటికప్పుడు సంబంధిత శాఖపై రివ్యూ తీసుకోనీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికీ నలుగురువిద్యార్థులు మృతి చెందగా, 920 మంది ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రి పాలైనరన్నారు. రాష్ట్రం లో నాసిరకం బియ్యం నిత్యవసర వస్తువులు అందించకుండా అధికారులు తనిఖీలు చేపట్టాలని, పెరిగిన ధరలను అమలు చేస్తూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్య

నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

క్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు,వెంకటేష్, చరణ్, శివ ,కిషోర్ ,ఉదయ్ ,సాయి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట నవంబరు30 ప్రభాతవార్త: కొత్తకోట మండల గ్రామాలలో ప్రభుత్వ హైస్కూల్ పాఠశాలలు శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవంతంగ బందు జరిగింది. అనంతరం కొత్తకోట ప్రభుత్వ హైస్కూల్ ప్రిన్సిపాల్ వివేకానంద కు డిమాండ్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు మొగిలి మాట్లాడుతూవిద్యార్థుల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా? విద్యాకమిషన్ ఎక్కడ అని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి లేకుం డా సంవత్సరం పాలనా విద్యావ్యవస్థపై సమీక్షా ఏది? అని మండి పడ్డారు. గురుకుల, సంక్షేమ హాస్టల్లు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా పరిషత్ హై స్కూల్,ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ ఫయిజాన్ తో అస్వస్థకు గురవుతున్నారని అన్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలనిఅన్నారు. మధ్యా హ్న భోజనానికి అధికనిధులు కేటాయించాలి. నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. వంట కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో మధ్యాహ్నంభోజనాన్ని అక్షయపాత్ర ఇస్కాన్ లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పచెప్పే ప్రయత్నం వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట మండలం కమిటీ నాయకులు రాజేష్, మహేందర్, అంజి, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు నవంబరు30 ప్రభాతవార్త: పెబ్బేర్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బందునిర్వహించారు. రాష్ట్రంలో

వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫాయిజాన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఎస్ఎఫ్ఐ పెబ్బేరు మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, ఆంజనేయులు మండిపడ్డారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలబందులో భాగంగా పెబ్బేరు మండల వ్యాప్తం గా విద్యాసంస్థల బందు చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పై ముఖ్యమంత్రి రివ్యూచేసి ఈతరహా ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికీ నలుగురు విద్యార్థులు మృతి చెందగా, ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రిపాలైన విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రంలో నాసి రకం బియ్యం నిత్యవసర వస్తువులు అందించకుండా అధికారులు తనిఖీలు చేపట్టాలని, పెరిగిన ధరలను అమలు చేస్తూ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారుచేశారు. రాష్ట్ర ప్రభుత్వంస్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తం గాఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ,శేఖర్, సూరి,అజయ్,శివ,గణేష్ ,బాలు,అంజి పాల్గొన్నారు.

వనపర్తి క్రైమ్ నవంబరు30 ప్రభాతవార్త: రాష్ట్రంలో రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫాయిజాన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, పిడిఎస్ యు నాయకులు గణేష్ వెంకటేష్ మండిపడ్డారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠ

మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

శాలల బందులో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బందు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ...రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పై ముఖ్యమంత్రి రివ్యూ చేసి ఈ తరహా ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికీ నలుగురు విద్యార్థులు మృతి చెందగా, 920 మంది ఫుడ్ పాయిజన్ తో ఆస్పత్రి పాలయ్యారని రాష్ట్రంలో నాసిరకం బియ్యంనిత్యవసర వస్తువులు అందించకుండా అధికా రులు తనిఖీలు చేపట్టాలని, పెరిగిన ధరలను అమలు చేస్తూ నాణ్య మైన పౌష్టికాహారం అందించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న నాయక్, నీలోత్పల్,భరత్,మోహన్, శ్రీకాంత్,ఆంజనేయులు కార్తీక్, హరీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

బంజరు భూములు.. బంగారం చేస్తాం

మహబూబ్‌నగర్ బ్యూరో, భూత్పూర్, నవంబరు30 ప్రభాతవార్తః వరి వేస్తే ఉరే అని చెప్పిన ఆనాటి పెద్దమనిషి కేసీఆర్.. కానీ ఈనాడు వరి ధాన్యానికి బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహ బూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పరిధిలోని అమిస్తాపూర్ వద్ద రైతు పండుగకు ఆయన హాజరై ముందుగా స్టాళ్లను సంద ర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ అవుతుంటే,బీఆర్ఎస్ గుండెల్లో పిడుగులు పడుతున్న ట్లుందన్నారు. కాళేశ్వరం లేకపోయినా, చుక్క నీరు రాక పోయినా కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల ద్వారా నీళ్లిచ్చి 66లక్షల ఎకరాల్లో 1కోటి 50లక్షల ధాన్యం తెలంగాణ రైతులు పండించారని పేర్కొ న్నారు. వరికి బోనస్ అందించి గర్వంగా పాలమూరు గడ్డపై రైతు పండుగ చేసుకుంటున్నామన్నారు. గతంలో ఔటర్ రింగ్‌రోడ్‌ను రూ.7500 కోట్లకు తెగనమ్మి ఐదేళ్లలో వాళ్లు రుణమాఫీకి ఖర్చు చేసింది 11వేల కోట్లే..ఈ 11 వేల కోట్లలో రూ.8596 కోట్లు మిత్తికే పోయాయని ఎద్దేవా చేశారు. రైతులకు మీరు చెల్లించింది కేవలం రూ.2500 కోట్లే..మిస్టర్ హరీష్‌రావు ఇది విను.. లెక్కలు కావాలంటే మళ్లీ చెబుతాం..కేసీఆర్‌కు ఈ వేదికగాసవాల్ విసురుతున్నా..25రోజుల్లో రూ.17,869 కోట్లు రుణ మాఫీ చేసిన చరిత్ర దేశంలో ఎక్కడైనా ఉందా నిరూపిం చండి..మోదీ వస్తారో..కేసీఆర్ వస్తారోరండి..చర్చిద్దాం అంటూ సవాల్ విసిరారు. మొదటి ఏడాది లోనే 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు.ఒక్కొక్కరుగా వస్తారో, అందరూ కలిసి వస్తారోరండి.. అసెంబ్లీలో చర్చిద్దాం.. రైతురుణమాఫీ చేసిన చరిత్రమాది.. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన చరిత్ర మాది.. రైతు బీమా తెచ్చింది కాంగ్రెస్..వరిపంటకురూ.500 బోనస్ ఇచ్చింది కాంగ్రెస్.. రైతు సంక్షేమం కాంగ్రెస్ పేటెంట్ అని తేల్చి చెప్పారు. కేసీఆర్.. పాలమూరు బిడ్డలు నిన్ను పల్లకిలో మోస్తే మా గుండెలపై తన్ని వలసలు పెరిగేలా చేసింది నువ్వు కాదా? అంటూ ప్రశ్నిం చారు. ఆనాడు పాలమూరును దత్తత తీసుకుంటా అని కేసీఆర్‌అన్నాడని కానీపదేళ్లయినా జిల్లా లో ప్రాజెక్టులనుపూర్తి చేయలేదని విమర్శించారు. ఇటీవలే తాము నారాయణపేట్-కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేస్తామం టే మాత్రం కాళ్లల్లో కట్టెలు పెడుతుండని దుయ్యబట్టారు.

ఏడాదికి రూ.20వేల కోట్లు తెస్తాం..

పాలమూరుకు నీళ్లు తెస్తామంటే కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు అడ్డుపడుతున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఎవడో వచ్చి పాలమూరును దత్తత తీసుకోవడంకాదు.మీ పాలమూరు బిడ్డనే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు.. ఎవరిదయా దాక్షిణ్యాలుమాకుఅవసరం లేదన్నారు. మనకు వచ్చిన ఈఅవకాశాన్నిజారవిడుచుకుందామా? పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టును మనం పూర్తి చేసు కోవద్దా?ఒకే సంతకంతో మనజిల్లాకు కావాల్సిన అన్ని తెచ్చుకుందాం.. ఏడాదికొక రూ.20వేల కోట్లు మా జిల్లాకు ఇవ్వాలని మీతరపున మామంత్రి వర్గాన్ని నేను అడుగుతా ..ఐదేళ్లలో లక్ష కోట్లు ఈ జిల్లాకు తెచ్చుకుంటే బంజరు భూములు బంగారు భూములుగా మారవా? అంటూ హామీ ఇచ్చారు.

అభివృద్ధి వెనక కొంత నష్టం తప్పదు..

కేసీఆర్ కమీషన్ల కక్కుర్తి కోసం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు తీసుకెళ్లిండు...అలాంటిది మన గడ్డ అభివృద్ధికి లక్ష కోట్లు తెచుకోలేమా..అంటూ పేర్కొన్నారు. మిత్రులారా... వాళ్ల సోయిలో పడి మోసపోవద్దు..నా ప్రాంత అభివృద్ధి కోసం, ఇక్కడి యువత కోసం కొడంగల్‌లో పారిశ్రామిక వాడ నిర్మించాలనుకుంటే..లగచర్ల చిచ్చు పెట్టి అమాయక లంబాడాలను జైల్లో పెట్టించిండ్రు.. వాళ్ల మాయమాటలు నమ్మి అమాయక లంబాడాలు జైలుకు పోయిండ్రని ఆరోపించారు. ఒక్క కేసీఆర్‌కే గజ్వేల్ లో వెయ్యి ఎకరాల ఫామ్ హౌస్ఉంది...మా పారిశ్రామిక వాడ కోసం 1300 ఎకరాలు ఉండొద్దా అంటూ ప్రశ్నించారు. ఆనాడు అధికా రులపై దాడులుచేసి ఉంటే నాగార్జునసాగర్ లాంటి ప్రాజెక్టులు పూర్తయ్యేవా అభివృద్ధి జరగాలంటే కొందరు నష్టపోక తప్పదు..వారికి కావాల్సిన నష్టపరిహారం ప్రభు త్వం అందిస్తుందని స్పష్టం చేశారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం వస్తేఒక తరం పరిస్థితే మారుతుంది... అలాంటి అవకాశం మీరు కోల్పోవద్దంటూ హితవు పలికారు.

కేసీఆర్ నీ మొసలి కన్నీరు పాలమూరు జిల్లాపై కాదంటూ ఫైర్ అయ్యారు. తాను ఇక్కడ పుట్టానని, ఇక్కడి మట్టిలో కలిసే వాణ్ణి.. ఈ ప్రాంతంపై నాకంటే ఎక్కువ ప్రేమ ఎవ రికి ఉంటుందో ప్రజలే చెప్పాలన్నారు. పారిశ్రామిక వాడ తెచ్చి 25వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే జిమ్మేదారి తనదని కుట్రలు, కుతంత్రాలకు బెదిరేవాణ్ణి కాదని తేల్చి చెప్పారు. తోడేళ్ళు, పులులు ఎన్నో చూశా..మానవ మృగాలు మీరెం త..పని చేయడమే తమకు తెలుసన్నారు. పనిలోపడి చేసింది చెప్పుకోలేకపోతున్నాం..తమకు ఏబ్రాండ్ అంబాస డర్లు అవసరం లేదని, మీరే మా బ్రాండ్ అంబాసిడర్స్ ..ఒక్కొక్క యువకుడు ఒక రేవంత్ రెడ్డిగా మారి అభి వృద్ధిని ప్రజలకు చేర్చండి.. నేను మీవాణ్ణి.. నన్ను ఆశీర్వ దించండి... కుట్రలను కుతంత్రాలను తిప్పి కొట్టండి.. పాలమూరులో 20 లక్షల ఎకరాలకు నీళ్లు తెచ్చే బాధ్యత తనదని స్పష్టం చేశారు. ఈ రైతు సదస్సులో ఉప ముఖ్య మంత్రి,ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,పొన్నం ప్రభాకర్,జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబు,సీతక్క,పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు ఎమ్మెల్సీలు కూచుకూళ్ల దామోదర్‌రెడ్డి,మహేశ్‌కుమార్‌రెడ్డి,ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి, వాకటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, రాజేశ్‌రెడ్డి, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, కేశవరావ్, మాజీ ఎంపీ ఎపి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షసపాలనకు చరమగీతం

-రైతు సదస్సులో ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్,నవంబరు 30, ప్రభాతవార్త: రాష్ట్రంలో రాక్షస పాల నకు గతేడాది నవంబరుతో రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడారని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడి (జీఎంఆర్) అన్నారు. శనివారం భూత్పూ ర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్‌లో కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సభ,రైతు సదస్సులో జీఎంఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృ త్వంలోని కాంగ్రెస్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా గత రెండ్రోజులుగా పండగ వాతావరణం నెలకొందని, ఎటు చూసినా రైతుల కోలాహలమే కనిపిస్తోందన్నారు. రాజకీయం కోసం తాము ప్రభుత్వాన్నేర్పాటు చేయలేదని, ప్రజా సంక్షేమం,రైతుల సుభిక్షం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.

రైతు బంధుతో ఓటు బ్యాంకు : మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రైతు బంధు పేరిట రైతుల్ని మభ్య పెట్టి ఓటు బ్యాంకును సంపాదించేం దుకు ప్రయత్నించిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి విమర్శిం చారు.సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయ పండుగ వచ్చిందని, ఏకకాలం లో 22లక్షల మంది రైతులకు రు.18వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.దేశంలో 54వేల కోట్ల రుణమాఫీ ఇచ్చిన ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

జీతాలివ్వలేని ప్రభుత్వం : పరిగి ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం లేనిపోని గొప్పలకు పోయి ఉద్యోగులకు కనీసం సకాలంలో జీతాలివ్వలేక పోయిందని పరిగి ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డి విమర్శించారు. మభ్యపెట్టి మాజీ సీఎం కేసీఆర్ అధికార పెత్తనం చెలాయించార న్నారు.గత ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం వడ్డీలు కడుతోందన్నారు.ఇంకా ఈ కార్యక మంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి,మాజీ మంత్రి షబ్బీర్ అలీ,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి,వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి,టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌లు ప్రసంగించగా, ఎమ్మెల్సీ కూచుకూళ్ల దామోదర్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కే కేశవరావు,జితేందర్‌రెడ్డి స్థానిక నేతలు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇతర నాయకులు,రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పదేళ్లలో పాలమూరు ఎడారి

మొదటి పేజీ తరువాయి భాగం..

రైతుల పక్షాన రూ.2500 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రికరణ, సబ్సిడీపై విత్తనాల సరఫరా వంటి కార్యక్రమాలను ఇందిరమ్మ ప్రభుత్వం పునరుద్ధరించింది అన్నారు. ఒక్క ఏడాదిలో కేవలం రైతుల కోసం రూ.73 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. రూపాయి రూపాయి పోగుచేసి సంపద సృష్టించి ముందుకు పోతున్నామని ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తున్నామని అన్నారు. మాది మీ లాగా దొరల ప్రభుత్వం కాదు.. ఇది ప్రజల ప్రభుత్వం మనందరి ప్రభుత్వం అన్నారు.

సిఎంకు మహారాజ్ టోపీతో సత్కరించిన పేట ఎమ్మెల్యే

నారాయణపేట టౌన